"కాశ్మీర్ భవిష్యత్తును యుద్ధమూలంగా కంటే దాని జనవాక్యం ద్వారా నిర్ధారణ చెయ్యడం న్యాయమైన మార్గము"ని అందులో తెలియజేశాడు. అట్లా "జనవాక్యాన్ని" సమర్థించే రాజ్యాల్ని చూసైనా బుద్ధిలో మార్పు కనబడటంలేదు.

ఇంత దేనికి? పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీరులో యీనాడు చెలరేగిన అల్లకల్లోలం, అసంతృప్తి యింతా అంతా కాదని పాకిస్థాన్ పత్రికలు ఘోల్లుమంటున్నాయి. కాని ఇండియా అధీనంలో వుంటోన్న కాశ్మీరాన్ని సందర్శించి అచ్చట ప్రకృతి సౌందర్యాన్ని చూసి ఆనందించమని ఇండియా ప్రభుత్వం ప్రపంచాన్నంతటినీ కోరి పిలుస్తున్నది. ప్రయాణ సౌకర్యాల నెన్నిటినో అందుబాటులో వుంచి వాటికోసమై ప్రత్యేకంగా "టూరిస్టు సౌకర్య శాఖ" నొకదానిని ప్రారంభించింది. ఎంతో మంది విదేశీయులు వచ్చారు. సంగతేమిటో కళ్లారా చూశారు. కాశ్మీర్‌ను ఏదేశం వృద్ధరిస్తుందో, ఏది నాశనం చేయబోతున్నదో ఆ విదేశ ప్రయాణీకులే చెప్పగలరు. శాంతి ఎక్కడుందో విదేశీయులే గుర్తించగలిగారు.

ఇంతకంటే నగ్న సత్యం ప్రపంచానికి, యు. ఎన్. ఓ.కి ఇంకేం కావాలి? "యుద్ధోన్మాది" అని తనంతటతనే పాకిస్థాన్ ఋజువు చేసుకుంటున్నదే! అప్పటికీ పరిష్కార మార్గం లేక సక్సెన్‌బుర్రలకు తోచలేదంటే బుద్ధి చెప్పటానికి పూనుకున్న ప్రధాని నెహ్రూదా, తప్పంతా?

——:O:——

స్కెచ్

# ఇంటాయన కనీసపు కోర్కెలు

"ఫూ. భా."

"సుబ్రమణ్యాం!" అని కేకవేశాను వెయిటింగ్ రూంలోంచి- ప్లాట్‌ఫారంమీద పేపరు చదువుతూ వెళుతూన్న సుబ్రహ్మణ్యాన్ని.

"ఓహో! మూర్తీ! ఏమిటి ఎక్కడకు వెళుతున్నావు. ఏమిటి కథ. చాలా రోజులకి కనిపించావోయ్. అంతా క్షేమమా!"

"ఏదో యిప్పటి కిలా ఉన్నాం. కొద్దిగా పనిమీద బరంపురం వెళ్లి తిరిగి వస్తున్నా. ఇంకా నువ్వు మహాపట్నంలోనే ఉంటున్నావనుకుంటున్నాను."

"శని విరగడైంది బ్రదర్! నువ్వు వెళ్ళిన రెండు నెలలకే యిక్కడకు వచ్చేశాను."

"అన్నట్టు మరచిపోయాను. అప్పటి యింటి సంగతి ఏమయింది?"

"అబ్బో చాలా ఉంది కథ. రా, కొద్దిగా టీ తాగి కూర్చుందాం. మరో గంటకిగాని మీ బండి రాదులే."

* * *

సుబ్రహ్మణ్యం చాలా సరదా అయినవాడు. అయిదు సంవత్సరాల క్రిందట మహాపట్నంలో చురుగ్గా యిళ్ళకోసం ప్రయత్నించే వాళ్లల్లో నేనొకణ్ణి, సుబ్రహ్మణ్యం ఒకడున్నూ. అడ్డమైన వీధులూ అనునిత్యం తిరగడంలో సుబ్రహ్మణ్యం తారసిల్లాడు. గూడులేని మా యిద్దరికీ స్నేహం బాగా అయింది. తరువాత మా యిద్దరికీ ఒక గదికోసరం కూడా ప్రయత్నించాం. కాని యెంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. లేవగానే యిద్దరం బయల్దేరి రాజమార్గాలూ, వీధులూ, సందులూ, గొందులూ, యిరుకు గల్లీలూ పదిగంటలవరకూ తిరగడం, నీరసం గెంటేస్తూంటే హోటల్లో పడి నాలుగు మెతుకులు వేసుకుని ఆఫీసుకు పోవడం, ఐదుగంటలవరకూ అక్కడ గొడ్డు చాకిరీచేయడం - తరువాత మళ్ళీ సందులంటా గొందులంటా తిరగడం, ముఖాలు వేలవేసుకుని హోటేలు చేరుకుని భోంచేసి, హోటేలు అరుగుమీదనో, బీచిలోనో, రైల్వే ప్లాట్‌ఫారం

మీదనో, కిటికీ కొట్టు బడ్డీమీదనో తినకడం–యిదీ మాదినచర్య. ఇలా వారాలూ, పక్షాలూ, నెలలూ ఎన్నో గడచిపోయాయి. కాని యిల్లు సంపాదించడంలో మాత్రం మేం కృతకృత్యులం కాలేకపోయాం.

ఇలా కొంతకాలం గడచేసరికి ఒక శుభవర్తమానం వచ్చింది, ఒక యిల్లు ఖాళీగా ఉందని. పట్టలేని ఆనందంతో పరుగెత్తాం యిద్దరం.

గృహ యజమాని పేరు ముందుగానే తెల్సుకున్నాం గనుక 'కామేశం పంతులుగారూ!' అని పిలిచాం. పిలుపు వినగానే కామేశం గారు వచ్చారు. ముణుకులు దిగని అంగవస్త్రం, పైమీద చిన్న తువాలూ, కళ్ళకి చవక రకం అద్దాలూ–యిదీ అతని వేషం. మమ్మల్ని ఆపాద మస్తకం చూసేసరికి నమస్కారం అన్నాం. మేం యింటికోసమే వచ్చినట్లు గ్రహించుకుని 'యిల్లు చూస్తారా' అన్నాడు.

కామేశంగారి తెలివి తేటలకు సంతోషించి "ఊఁ" అన్నాం.

"పదండి" అంటూ తీసుకువెళ్ళాడు.

ఇల్లనేది దొరికితే చాలనే పరిస్థితిలో మేం ఉంటే మాకు నచ్చకపోవటం ఒకటా! పెద్ద గదీ, చిన్న గదీ, పెరడూ, నుయ్యీ దొడ్డీ బాగానే ఉంది.

"నచ్చిందాండి" అన్నాడు కామేశం.

"ఏదో మాకు చాలులెండి" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అయితే వినండి. ఇది కేవలం గృహస్థులకేగాని బ్రహ్మచారులకి యివ్వబడదు. యాభై రూపాయిలకి ఒక్కదమ్మిడీ తగ్గదు అద్దె. ఇక కుటుంబీకులకైనా పిల్లలుంటే మాకు కుదరదు. చిత్తగించారా! ఇక యిందులో వంట పెడితే పొగజూరి యిల్లు పాడవుతుంది. అందుచేత నిప్పు వెయ్యకూడదు. ఇవన్నీ మీరు ఆలోచించుకుని నా కేకబురైనా రేపు సాయంత్రంలోగా చెప్పండి. వ్యవహారందగ్గర నేను చాలా ఖచ్చితంగా ఉంటాను. ఆ తరువాత తగువులు పడటం మర్యాదగా ఉండదు చూడండీ" అన్నాడు కామేశం.

"సరే ఏ కబురైనా రేపు చెపుతామండి." అంటూ తిరుగు ముఖం పట్టాం.

"మూర్తీ! కామేశం వంటి వాళ్ళని ఏం చేసినా తప్పులే" దన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఏం?" అన్నాను. అప్పుడే సుబ్రహ్మణ్యం ముఖంలో కోపం మెరుస్తోంది.

"ఏవేమిటి. ఆ షరతులన్నీ వినలా? నువ్వు పక్కనున్నావుగాని లేకపోతే కావలసినంత గొడవవును. బ్రహ్మచారుల కివ్వట్ట. డబ్బు కోసం ఏడిసే వాడికి. బ్రహ్మచారైతే వీడి కెందుకు కాకపోతే వీడి కెందుకు. ఇక గృహస్థుడికైనా పిల్లలుండ కూడదుట. ఇంతవరకూ ప్రభుత్వమే పిల్లల్ని కనకూడదని శాసించ లేదు. ఫూల్! యీ వెధవ యింటికోసం యిళ్ళు దొరకని వాళ్ళు పిల్లల్ని కనుక్కోవడం మానేస్తారోయ్. పోనీ భార్యా భర్తలే ఉన్నా యింట్లో వండుకుందికి వీల్లేదుట. అంటే హోటలునుంచి తెప్పించుకోవాలి. యాభై రూపాయిలు వీడినెత్తిని కొట్టి, మరో యాభై రూపాయిలు భోజనానికి యిచ్చి, యింకో ముప్ఫై రూపాయిలు కాఫీకీ టిఫిన్‌కీ అయితే యింక మిగతా కర్చులు? నాలుగు నెలల జీతాలు సరిపోతాయటోయ్. వీడూ వీడి దురాశానూ. ఎలాగైతే నేం కట్టించాడోయ్ యిల్లు. బోడి యిల్లూ, వీడూను."

నాకు నవ్వొచ్చింది.

"నువ్వలా తేలిగ్గా నవ్వేశావ్‌గాని నాకు మాత్రం ఒళ్లు మండి పోతోంది."

"అయితే ఏంచేస్తాం సుబ్రహ్మణ్యం."

"ఎలాగైనా వాడికో గుణపాఠం చెప్పాలి."

"ఎలా? అయింట్లో దిగితే ఎలాగైనా చెయ్యొచ్చు. యిద్దరమూ బ్రహ్మచారులం అయి పోయాం కద."

"ఈరాత్రల్లా ఆలోచిద్దాం పద."

"మూర్తీ! నువ్విక్కడే ఉండు. నేనా యింటికి వెళ్లొస్తా" నన్నాడు సుబ్రహ్మణ్యం మర్నాడు సాయంత్రం.

"బ్రదర్! నువ్వొక్కడివే వెళితే ఏం తగువు తెస్తావో."

"నువ్వేం భయపడ నక్కరలేదు. ఈ

రోజు శాంతం నాలో మూర్తీభవించింది." అంటూ బయల్దేరాడు.

సుబ్రహ్మణ్యం వెళ్ళేసరికి కామేశం పంతులు లేడుట. కాని యింటి దగ్గర మాత్రం చెప్ప వలసిన సంగతులు చెప్పాట్ట. మీరు చెప్పిన షరతులన్నిటికీ ఒప్పుకున్నాననిన్నీ, వారం రోజుల్లో భార్యని తీసుకు వస్తాననిన్నీ, తనకి పిల్లా జెల్లా లేరనిన్నీ చెప్పి ఆ గదికి తాళంవేసి వచ్చాడు సుబ్రహ్మణ్యం.

ఇది జరిగిన నాలుగు రోజులకే నాకు ట్రాన్స్ఫర్ ఆర్డరు వచ్చింది. వెంటనే వెళ్ళి పోయాను. తరువాత నాకూ సుబ్రహ్మణ్యానికీ మధ్య ఉత్తరాలు నడవలేదు. ఉత్తరాలు వ్రాసే అలవాటు నాకు లేకపోవడం నుంచి నాకు ఎవరూ వ్రాయరు.

*   *   *

టీ త్రాగి ప్లాట్ఫారం కొసకి పోయి కూర్చున్నాం. మంచీ చెడ్డా మాట్లాడుకున్నాక యింటి సంగతి ప్రారంభించాడు.

"నిన్ను రైలెక్కించేసి రెండు పెట్టెలు ఆయింట్లో పడేసి డబుల్ లాక్ వేశాను. నేను తిరిగి అక్కడకు వెళ్ళనే లేదు. రెండు నెలల వరకూ కామేశానికి కనుపించకుండా తిరిగాను. కామేశం మాత్రం ఊళ్లో ఉన్న ప్రతి ఆఫీసుకూ తిరిగేవాడు నాకోసం. యీగొడవ కొంత మందికి చెప్పాడు కూడా. కాని నాకు మాత్రం యీ విషయం ఏమీ తెలియనట్టే నటించాను.

పెద్ద మనుష్యుల్ని దగ్గరపెట్టి తాళం విడ గొట్టించే ఉద్దేశంతో కామేశం ఉన్నట్టు నాకు తెలిసి ఊరూ, పేరూ వ్రాయకుండా, సంతకం బోధ పడకుండా ఉత్తరం వ్రాసి యక్స్పెర మెంటల్ పోస్టాఫీసులో పడేశాను. ఒక నెల రోజులలో వచ్చి యింటద్దె అంతా యిచ్చేసి సామాన్లు పట్టించుకు పోతానని అందులో వ్రాశాను. తరువాత రెండు నెలలు శలవు పెట్టేసి యిక్కడకు వచ్చేశాను."

"తరువాత" అన్నాను శ్రద్ధగా.

"శలవా ఖర్ని యిక్కడకే బదిలీ చేయించుకున్నాను లంచం యిచ్చుకొని. ఆర్నెల్ల వరకూ ఎవరూ రాక పోవడం చూచి కామేశం ఒక ప్రకటన చేశాట్ట. ఇంట్లో దిగి పరారైన వాళ్లు నిర్ణీతమైన తేదీలోగా రాకపోతే పెద్ద మనుషుల ఎదుట తాళాలు విడగొట్టిస్తామనిన్నీ, అందులో సామాన్లు పోలీసులకి అప్పగిస్తామనిన్నీ ప్రకటన సారాంశం."

"మరి నీ పెట్టెలు సంగతి."

"కాళీ పేకేజి డొక్కులోయ్."

ఆపుకో లేని నవ్వొచ్చింది నాకు.

"తరవాత" అన్నాను.

"తరువాత ప్రకటించినట్లు కార్యక్రమం నడిపించాట్ట. కాళీ డొక్కులు చూచి పెద్ద మనుషులు తెగనవ్వారుట. అదో పెద్ద గోడవ. ఇప్పుడు కామేశం యిలు అద్దెకివ్వటం మానుకున్నాట్ట."

ఏదైనా ఒకదానితో సంఘర్షిస్తూ ఉండడం మానవస్వభావం. ఈ సంఘర్షణలో కొందరు జయిస్తారు. మరికొందరు పరాజితులవుతారు. పరాజయం పొందినవాళ్ళకు అనంతరాధికారులుగా మిగిలియుండే అనుయాయులెవ్వరూ ఉండరు. కాబట్టి సమర్థులై విజయం పొందినటువంటివారి చిత్తప్రవృత్తిమాత్రమే పారంపర్యముగా లోకానికి సంక్రమిస్తుంది. ఏ సందర్భంలోనైనా జయాపజయముల అవకాశము సరిసమానంగా ఉండే పక్షంలో, ఆత్మస్థైర్య విశ్వాసం మూలంగా తనకుగల అవకాశాన్ని అతిశయోక్తులతో గోరంతలు కొండంతగా పెంచి నిర్వచిస్తాడు. అట్టి స్థితిలో గెల్చి గట్టెక్కినవాని విషయమై వారి అదృష్టరేఖా మహిమవల్ల అన్ని కష్టాలు జయించారని అంటారు. అపజయముపాలై అడుగంటి పోయినవారు ఏమని చింతించిరో వారి భావ ధోరణి ఏమిటో మనకు తెలియదు.

—బెర్ట్రాండ్ రసెల్.